క్లుప్తంగా

సమాచార హక్కుచట్టంపై అవగాహన



రైతులకు అవగాహన కల్పిస్తున్న ఏవో ద్వారకాదేవి

కడియం: ప్రతి ఒక్కరూ సమాచార హక్కు చట్టం – 2005పై అవగాహన కలిగి ఉండాలని మండల వ్యవసాయాధికారి కె.ద్వారకాదేవి అన్నారు. రైతులకు సమాచార హక్కుచట్టంపై అవగాహన కార్యక్రమం మండలంలోని దుళ్ళలో మంగళవారం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఏవో మాట్లాడుతూ ప్రభుత్వ పరిధిలోని ప్రతి శాఖకు సంబంధించిన వివరాలను పొందే హక్కు పౌరులకు ఉందన్నారు. తద్వారా పారదర్శక పాలనకు అవకాశం కలుగుతుందన్నారు. నిర్ణీత నమూనాలో దరఖాస్తును పూర్తి చేసి, సంబంధిత అధికారికి అందజేయడం ద్వారా తగిన వివరాలను పొందవచ్చునన్నారు. సమాచార హక్కుచట్టం ద్వారా పొందే సమాచారం, దరఖాస్తు విధానం రైతులకు తెలియజేశారు. కార్యక్రమంలో వ్యవసాయ సహాయకులు, రైతులు పాల్గొన్నారు.

18వ డివిజన్‌లో మహా అన్నదానం

ఆల్కాట్‌తోట (రాజమహేంద్రవరం రూరల్): రాజమహేంద్రవరం నగరపాలక సంస్థ పరిధిలోని 18వ డివిజన్ వెల్లంకివారివీధిలో శ్రీదేవి శరన్నవరాత్ర ఉత్సవాల ముగింపు సందర్భంగా విజయదుర్గ ఫ్రెండ్స్ సర్కిల్ ఆధ్వర్యంలో మహా అన్నసంతర్పణ నిర్వహించారు. టీడీపీ రాష్ట్ర వైద్య విభాగం ప్రధాన కార్యదర్శి డాక్టర్ గోరంట్ల రవిరామ్‌కిరణ్ భక్తులకు అన్న వితరణ చేశారు.

నేడు బాలాజీపేటలో..

బొమ్మూరులోని బాలాజీపేటలో వేంచేసియున్న శ్రీవిజయ కనకదుర్గాదేవి ఆలయంలో శ్రీదేవీశరన్నవరాత్రుల సందర్భంగా బుధవారం ఉదయం 11.00గంటలకు మహా అన్న సమారాధన జరుగుతుందని ఆలయకమిటీ ఓ ప్రకటనలో తెలిపింది.


నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

రాజమహేంద్రవరం సిటీ: విద్యుత్ లైన్ల నిర్వహణ నిమిత్తం బుధవారం రాజమహేంద్రవరం డివిజన్‌లో పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడనుందని ఏపీఈపీడీసీఎల్ ఈఈ నక్కపల్లి శ్యామ్యూల్ మంగళవారం ప్రకటించారు. ఉదయం 7 గంటల నుంచి మధ్యాహ్నం 1గంట వరకు కలిగే అంతరాయంతో రాయుడుపాకలు, కోలమూరు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడనుందన్నారు.

ప్రాణాలతో చెలగాటం వద్దు

రాజమహేంద్రవరం సిటీ: విద్యుత్ ప్రమాదాలను నివారించేందుకు ఎలక్ట్రికల్ ఉపకరణాల విషయంలో ఎల్లప్పుడూ అప్రమత్తంగా ఉంటూనే ముందస్తు జాగ్రత్తలు తీసుకోవడం ద్వారా ప్రమాదాలను నివారించవచ్చునని ఏపీఈపీడీసీఎల్ రాజమహేంద్రవరం సూపరింటెండెంట్ ఇంజినీర్ కె.తిలక్‌కుమార్ విజ్ఞప్తి చేశారు. మంగళవారం ఈ మేరకు ప్రకటన విడుదల చేశారు. ఇంటి పరిసరాలలో కానీ, రహదారులలో కానీ, వ్యవసాయ క్షేత్రలలో కానీ, ఎక్కడైనా కిందికి వాలిఉన్న, తెగిపడిన విద్యుత్ తీగలు కనపడితే వాటిని తాక కుండా చుట్టుపక్కల ఉన్నవారిని అప్రమత్తం చేస్తూనే సంబంధిత విద్యుత్ సిబ్బందికి గాని, 1912 టోల్ ఫ్రీ నంబర్‌కు గాని సమాచారం అందజేయాలన్నారు. ఇంట్లో ఉన్న ప్రతి ఎలక్ట్రికల్ పరికరానికి సమగ్రమైన ఎర్తింగ్ ఉండేలా చూసుకోవాలన్నారు. అపార్ట్‌మెంట్, కమర్షియల్ కాంప్లెక్స్‌లలో ఐఎస్ఐ మార్క్ ఉన్న వైర్లను మాత్రమే వాడాలన్నారు.

సినిమాలు



రాజమహేంద్రవరం:

శ్యామల:	వేట్టయన్
సూర్యమినీ:	ఈశ్వర్
సూర్యప్యాలెస్:	సలార్
శివజ్యోతి:	మార్టిన్
అనుశ్రీ:	జనక అయితే గనక
స్వామి:	శ్వాగ్
అశోక:	విశ్వం
రాజా:	మార్టిన్
రంభ:	రాధేకృష్ణ, మానాన్న సూపర్‌హీరో
ఊర్వశి:	సత్యం సుందరం
మేనక:	కల్లుకాంపౌండ్,మార్టిన్
కుమారి:	దేవర
అప్సర:	దేవర

నామవరం:

వీఎస్.మహల్:	వేట్టయన్,విశ్వం

ధవళేశ్వరం:

మురళీకృష్ణ:	దేవర

కడియం:

వెంకటసూర్య:	దేవర,వేట్టయన్

ఇళ్ల మధ్యనే మద్యపానం!

- అసలే ఆవరోడ్డు.. ఆపై మందుబాబులు!
- ఒకే చోట రెండు మద్యం షాపులు
- రాత్రి సమయాల్లో ఆ దారిలో ప్రయాణించాలంటేనే భయపడుతున్న ప్రజలు
- దుకాణాల సమీపంలోనే తాగేస్తున్న వైనం
- బొమ్మూరులో ఇళ్ల మధ్య మద్యం షాపు తొలగించాలని ఎమ్మెల్యేకు మహిళల మొర



ఆవరోడ్డులోని మద్యం షాపులు



షాపుల మధ్య ఖాళీ స్థలంలో తాగుతున్న మందుబాబులు



మద్యం షాపు తొలగించాలని ఎమ్మెల్యే గోరంట్లను కోరుతున్న బొమ్మూరు మహిళలు

రాజమహేంద్రవరం రూరల్: వీధి దీపాలు సరిగాలేని ఆవరోడ్డు నుంచి తూర్పు రైల్వేస్టేషన్ దారిలో రాత్రి సమయాల్లో ప్రయాణించాలంటేనే వాహన చోదకులు హడలిపోతున్నారు. అటువంటిది ఆ రోడ్డులో రెండు మద్యం షాపులు ఒకేచోట ఏర్పాటు చేయడంతో ప్రజలకు ఆ భయం మరింత ఎక్కువైంది. ఎప్పుడు ఏం జరుగుతుందోనని వాహన చోదకులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. బొమ్మూరు గ్రామంలో కలువలచెరువు వెనుక ఉన్న మద్యంషాపును ఇళ్లమధ్య నుంచి తొలగించాలని రూరల్ ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్యచౌదరికి స్థానికులు విన్నవించారు. కూటమి సర్కారు నూతన మద్యం పాలసీతో తమకు కొత్త కష్టాలు వచ్చాయని జనం ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

గతంలో షాపు ఉన్నా

నూతన మద్యం పాలసీలో భాగంగా కూటమి రాజమహేంద్రవరం రూరల్ మండలానికి 11 మద్యం షాపులు మంజూరు చేసింది. లాటరీలో మద్యం షాపులు దక్కించుకున్న యజమానులు వారికి అనుకూలంగా ఉన్న ప్రదేశాలలో ఏర్పాటు చేసుకున్నారు. ఆవరోడ్డు నుంచి తూర్పు రైల్వే స్టేషన్‌కు వెళ్లే రోడ్డులో గత ప్రభుత్వంలో ఒక మద్యం షాపు ఉండేది. మందుబాబులు అక్కడ మద్యం కొనుక్కొని తీసుకెళ్లిపోయేవారు. దీంతో ఎవరికీ ఇబ్బంది ఉండేది కాదు. అయితే ఇప్పుడు ఒకే చోట పక్కపక్కన రెండు మద్యం షాపులను యజమానులు ఏర్పాటు చేశారు. ఈ బ్రాందీషాపులకు సమీపంలో అపార్టుమెంట్లతో పాటు, బీఆర్‌కే గ్రూప్‌హౌసెస్ ఉన్నాయి. ఇందులో నివసించే వారందరూ ఈ రోడ్డులోనే రాకపోకలు సాగించాల్సి ఉంటుంది. మహిళలు ఎక్కువశాతం మంది ఉద్యోగస్తులు కావడంతో మందుబాబుల వల్ల ఎటువంటి ఇబ్బందులు చోటు చేసుకుంటాయోనని భయాందోళన చెందుతున్నారు.

మద్యం షాపుల వద్దే మద్యం తాగేస్తున్న మందుబాబులు

ఆవరోడ్డులో రెండు మద్యంషాపులు మధ్య ఉన్న ఖాళీస్థలాల్లోనే మందుబాబులు తాగుతున్నారు. మందు నిషాలో వారు ఎలా ప్రవర్తిస్తారో అనే ఆందోళన ఉన్నందున్న ఎక్సైజ్ అధికారులు ఆవరోడ్డులో మద్యంషాపుల విషయంపై ఒక నిర్ణయం తీసుకోవాలని వాహన చోదకులు, స్థానికులు కోరుతున్నారు. మద్యం షాపులకు సమీపంలో ఒక ప్రైవేటు పాఠశాల ఉంది. సాయంత్రం సమయంలో విద్యార్థులను తీసుకువెళ్లేందుకు తల్లులు వస్తుంటారు. అలాగే రైళ్ల దిగిన ప్రయాణికులు తూర్పురైల్వేస్టేషన్ నుంచి ఆవరోడ్డులో ప్రయాణిస్తుంటారు.

ఎమ్మెల్యే గోరంట్లకు వినతి

బొమ్మూరులో కలువలచెరువు వెనుక ఉన్న మద్యంషాపును తొలగించేలా చర్యలు తీసుకోవాలని ఆప్రాంతవాసులు మంగళవారం రూరల్ ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్యచౌదరికి వినతి పత్రం అందజేశారు. ఎమ్మెల్యే గోరంట్ల గత ఐదేళ్లగా మద్యం షాపు ఉన్నప్పుడు లేని బాధ ఇప్పుడు వచ్చిందా అని ప్రశ్నించారు. గతంలో మద్యం కొనుగోలు చేసుకుని వెళ్లిపోయేవారిని, ఇప్పుడు అక్కడే తాగి తమ వీధుల్లో మందుబాబులు హల్‌చల్ చేస్తున్నారన్నారు. దీనివల్ల తమ ప్రాంతవాసులకు రక్షణ లేకుండా పోతోందని ఎమ్మెల్యే వద్ద మహిళలు మొర పెట్టుకున్నారు. దీంతో ఎమ్మెల్యే ఎక్సైజ్ అధికారులతో మాట్లాడతానని చెప్పారు. అక్కడ ఉన్న బొమ్మూరు ఎస్సై సీహెచ్‌వీ రమేష్‌ను మద్యం షాపు సమస్యను పరిశీలించాలని ఆదేశించారు.

మద్యం షాపుల వల్ల ఇబ్బందే



రోడ్డుకి ఆనుకుని కాంపౌండ్ వాల్ కూడా లేకుండా మద్యం షాపులు ఏర్పాటు చేశారు. అక్కడే మద్యం అమ్మకాలు, తాగడం మొదలయ్యాయి. దీనివల్ల స్థానికులకు, రైళ్ల ఎక్కే, దిగే ప్రయాణికులకు, మహిళలకు ఇబ్బంది. అదే వ్యాపారం మరికొంత దూరంలో నిర్వహించుకోగలిగితే ఎవరికీ ఇబ్బంది ఉండదు. వ్యాపారులు, ప్రభుత్వం ఆ దిశగా ఆలోచన చేయాలి.

– కె.ధర్మ, సామాజిక కార్యకర్త

ఆ షాపులు తాత్కాలికమే..

ప్రస్తుతం ఆవరోడ్డులో ఉన్న మద్యం షాపులు తాత్కాలికం మాత్రమే. మద్యం వ్యాపారులు పర్మినెంట్ షాపుల కోసం చూస్తున్నారు. ఎక్సైజ్ అండ్ ప్రొహిబిషన్ నిబంధనల మేరకు మాత్రమే షాపులు ఏర్పాటు చేయాల్సి ఉంది. బొమ్మూరులోని మద్యంషాపు కూడా తాత్కాలికమే. ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు కలుగకుండా చర్యలు చేపడతాం.

– కె.సుబ్బిరెడ్డి, ఇన్‌స్పెక్టర్, ఎక్సైజ్ సౌత్ స్టేషన్, రాజమహేంద్రవరం

పీఎఫ్ ఖాతా రద్దు చేసి నగదు ఇప్పించండి

– కమిషనర్‌కు ఏపీటీఎఫ్ వినతి



కమిషనర్‌కు వినతిపత్రం అందజేస్తున్న దృశ్యం

రాజమహేంద్రవరం సిటీ: రాజమహేంద్రవరం నగరపాలక సంస్థ ఉపాధ్యాయులను విద్యాశాఖలో విలీనం చేసిన కారణంగా, పీఎఫ్ ఖాతాలు రద్దు చేసి నగదు రూపంలో ఇప్పించాలని ఏపీటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి కేవీవీ సత్యనారాయణ విజ్ఞప్తి చేశారు. మంగళవారం కమిషనర్ కార్యాలయంలో కమిషనర్ కేతన్‌గార్గ్‌ను కలసి వినతిపత్రం అందజేశారు. గతంలో కొందరు ఉపాధ్యాయులు 75 శాతం నగదును అప్పుగా తీసుకున్నారని, వారికీ మిగిలిన 25శాతం సొమ్మును ఇప్పించాలని కోరారు. రాష్ట్ర కార్యదర్శి ఎ.ఉదయ బ్రహ్మం, జిల్లా గౌరవాధ్యక్షుడు వరుల అప్పయ్య శాస్త్రి, నగర శాఖ అధ్యక్షుడు కె.డేవిడ్‌లివింగ్ స్టన్ పాల్గొన్నారు.

గ్రామాల అభివృద్ధే లక్ష్యం



రైతుల నుంచి అర్జీలు స్వీకరిస్తున్న డిప్యూటీ తహసీల్దార్ రాజాబాబు

రాజమహేంద్రవరం రూరల్: గ్రామాల అభివృద్ధి కూటమి ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్యచౌదరి పేర్కొన్నారు. పల్లె పండుగ వారోత్సవాలు పురస్కరించుకుని మంగళవారం బొమ్మూరు, రాజవోలు గ్రామాల్లో నిర్వహించిన కార్యక్రమాల్లో ఆయన పాల్గొన్నారు. బొమ్మూరు వడ్డి వీరభద్రరావు కాలనీలో రూ.కోటితో రోడ్లు, డ్రైన్ల పనులను, రాజవోలులో రూ.55 లక్షలతో రోడ్లు, డ్రైన్ల పనులను మొదలు పెడుతున్నామని తెలిపారు. వీరభద్రనగర్‌లో స్థానిక మహిళలు కరెంటు సమస్యను ఎమ్మెల్యే దృష్టికి తీసుకురాగా పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. రాజవోలులో బరియల్ గ్రౌండ్ ఆధునీకరణకు రూ.10 లక్షలు మంజూరు చేస్తున్నట్లు తెలిపారు.

రెవెన్యూ గ్రామసభకు 12 అర్జీలు

రాజమహేంద్రవరం రూరల్: రెవెన్యూ గ్రామసభలో రైతులు 12 అర్జీలు అందజేశారని రూరల్ డిప్యూటీ తహసీల్దార్ ఎ.రాజాబాబు అన్నారు. మంగళవారం బొమ్మూరులో రెండోరోజు రెవెన్యూ గ్రామసభ ఆయన అధ్యక్షతన జరిగింది. రైతుల అర్జీలను సత్వరమే పరిష్కరిస్తామని రాజాబాబు తెలిపారు. రెవెన్యూ గ్రామసభను రూరల్ తహసీల్దార్ పీవీవీ జయసూర్యకుమార్ పరిశీలించారు. వీఆర్‌వోలు, రైతులు పాల్గొన్నారు.

ప్రతిభ కనబరిచే ఉద్యోగులకు ప్రోత్సాహం



ఆర్టీసీ ఉద్యోగులను అభినందించిన డిపో మేనేజర్ షేక్ షబ్నం

రాజమహేంద్రవరం సిటీ: విధి నిర్వహణలో ఉత్తమ ప్రతిభ కనబరిచే ఆర్టీసీ ఉద్యోగులను ప్రోత్సహించేందుకు కృషి చేస్తున్నట్టు రాజమహేంద్రవరం ఆర్టీసీ డిపో మేనేజర్ షేక్ షబ్నం పేర్కొన్నారు. ప్రతిభ కనబరిచే ఉద్యోగులకు ప్రతీ నెల ఎంపిక చేసి, ప్రోత్సాహక నగదు బహుమతులు, ప్రశంసాపత్రాలను అందించే కార్యక్రమాన్ని మంగళవారం డిపో గ్యారేజీలో నిర్వహించారు. డిపో మేనేజర్ షేక్ షబ్నం మాట్లాడుతూ సెప్టెంబర్ నెలలో కండక్టర్లు, డ్రైవర్లు వారి కృషితో అత్యధిక ఆదాయాన్ని డిపోకు సంపాదించారన్నారు. డీజిల్ సేవింగ్ విషయంలో ఇదే స్ఫూర్తిని కొనసాగించి, డిపో అభివృద్ధికి తోడ్పాటును అందించాలని విజ్ఞప్తి చేశారు. ప్రయాణికులకు మెరుగైన సేవలను అందించి, వారి మన్ననలు పొందాలని, ఏ విధమైన ఫిర్యాదులు రాకుండా, ప్రమాదాలకు తావు ఇవ్వకుండా ఓర్పు, సహనంతో విధులు నిర్వర్తించాలని కోరారు. నలుగురు డ్రైవర్లు, నలుగురు కండక్టర్లు, ఇద్దరు గ్యారేజ్ సిబ్బందిని అభినందించారు. అసిస్టెంట్ మేనేజరు (ట్రాఫిక్) అజయ్‌బాబు, అసిస్టెంట్ ఇంజినీరు (మెకానికల్) నాగలక్ష్మి పాల్గొన్నారు.

పురస్కార గ్రహీతకు సత్కారం



మణికంఠకుమార్‌ని సత్కరిస్తున్న సంఘీయులు

సీటీఆర్ఐ: నాదస్వరంలో రాష్ట్ర స్థాయి ఆంధ్రరత్న పురస్కారం అందుకోవడం ఆనందంగా ఉందని తోనంగి మణికంఠ కుమార్ అన్నారు. అఖిల భారత తెలుగు సాంస్కృతిక సంస్థ ఆధ్వర్యంలో ఏటా వివిధ రంగాలలో విశిష్ట సేవలు అందించిన వారికి రాష్ట్రస్థాయి పురస్కారాలు అందిస్తారు. సోమవారం విజయవాడలో ప్రెస్‌క్లబ్‌లో అఖిల భారత తెలుగు సాంస్కృతిక సంస్థ నిర్వహించిన 24వ ఆత్మీయ పురస్కారాల ప్రదానోత్సవ కార్యక్రమంలో ఆంధ్ర రాష్ట్రం నుంచి ఎంపికైన తోనంగి మణికంఠ కుమార్.. అన్నమయ్య జిల్లా మేజిస్ట్రేట్ పసుపులేటి శంకర్, కన్నడ నటి పంకజ చేతుల మీదుగా ఆంధ్రరత్న పురస్కార అవార్డు అందుకున్నాడు. ఈ సందర్భంగా రాజమహేంద్రవరం సుబ్బారావునగర్‌లోని ఆయన స్వగృహంలో మంగళవారం నాగా బ్రాహ్మణ సంఘం ఆధ్వర్యంలో మణికంఠకుమార్‌ను సత్కరించారు. కోనంగి రామారావు, పెద్ద సాయిబాబా, గౌతమి హితకారిణి సంఘం మాజీ చైర్మన్ బర్రే కొండబాబు పాల్గొన్నారు.

వరద బాధితులకు సహాయం

సీటీఆర్ఐ: విజయవాడ వరద బాధితుల సహాయార్థం ముఖ్యమంత్రి సహాయ నిధికి సంజీవయ్యనగర్‌కు చెందిన శ్రీ బాలాజీ విద్యానికేతన్ విద్యార్థులు సేకరించిన రూ.20,000 చెక్కు, మున్సిపల్ కాలనీకి చెందిన ప్రతిభ ఒకేషనల్ నర్సింగ్ కళాశాల సేకరించిన రూ.10,000 చెక్కు తిలక్ రోడ్డులోని నగర టీడీపీ కార్యాలయంలో బేసరి చిన్ని సారథ్యంలో మంగళవారం ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్‌కు అందచేశారు.

జాబ్ మేళాలో 37 మంది ఎంపిక



అభ్యర్థులను ఇంటర్వ్యూ చేస్తున్న ప్రతినిధులు

రాజానగరం: స్థానిక మండల ప్రజా పరిషత్ కార్యాలయ ప్రాంగణంలోని స్కిల్ హబ్‌లో మంగళవారం నిర్వహించిన జాబ్‌మేళాలో 37 మందికి ఉద్యోగాలు లభించాయి. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ, జిల్లా ఉపాధి కల్పన సంస్థల సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ జాబ్‌మేళాకు 69 మంది నిరుద్యోగులు హాజరయ్యారు. మూడు కంపెనీలు పాల్గొని 37 మందిని ఇంటర్వ్యూలో ఎంపిక చేశాయి. కార్యక్రమంలో ఎంపీడీఓ జేఏ ఝాన్సీ, ఏపీఎస్ఎస్‌డీసీ ఏడీ పెరుమాళ్‌రావు, జిల్లా ఉపాధి కల్పనా సంస్థ ప్రతినిధి జేఈ రవి, స్కిల్ హబ్ కోఆర్డినేటర్ గణేష్ తదితరులు పాల్గొన్నారు.

28న ఎల్‌ఐసీ ఏజెంట్ల మహాధర్నా



రాజమహేంద్రవరంలోని ఎల్ఐసీ డివిజనల్ కార్యాలయం వద్ద నిరసన తెలుపుతున్న ఏజెంట్లు

రాజమహేంద్రవరం రూరల్: ఎల్ఐసీ ఏజెంట్ల న్యాయమైన డిమాండ్లు నెరవేర్చాలని కోరుతూ అఖిల భారత జీవిత బీమా సంస్థ ఏజెంట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈ నెల 28వ తేదీన మహాధర్నా నిర్వహిస్తున్నట్టు రూరల్ బ్రాంచి అసోసియేషన్ అధ్యక్షుడు ఆదిమూలం సాయిబాబా తెలిపారు. 68 సంవత్సరాలుగా కమీషన్‌లో ఎదుగుదల లేకున్నా పాలసీల విలువ పెరుగుదలతో సర్దుకుపోతున్నామన్నారు. కమీషన్ పెంచమని, జీతాలు ఇవ్వాలని, బోనస్ ప్రకటించాలని కోరడం లేదు, పాత కమీషన్ రేటునే కొనసాగించమని సంస్థను కోరుతున్నామన్నారు.

అసంపూర్తిగా క్రీడా వికాస కేంద్రాలు

- ఎనిమిదేళ్లుగా పడకేసిన పనులు
- 2016–17లో నిధులు మంజూరు
- ఒక్కో కేంద్రానికి రూ. 2 కోట్ల కేటాయింపు



దేవరపల్లి ఏఎస్ఎన్ జెడ్పీ హైస్కూల్లో అసంపూర్తిగా ఉన్న క్రీడా వికాస కేంద్రం



జెడ్పీ హైస్కూల్లో క్రీడా మైదానంలో ఆటగాళ్ల సందడి



2016లో వేసిన వికాస కేంద్రం శంకుస్థాపన శిలాఫలకం

దేవరపల్లి: ఆలోచన మంచిదే.. ఏళ్లు గడుస్తున్నా ఆచరణకు మాత్రం నోచుకోలేదు. ప్రతి నియోజకవర్గానికీ అన్ని వసతులతో కూడా క్రీడా వికాస కేంద్రాలు అందుబాటులోకి వస్తే క్రీడా రంగంలో యువత మరింత ఉత్సాహంగా ముందుకు దూసుకుపోతుంది. క్రీడాకారులకు శిక్షణ ఇవ్వడంతో పాటు క్రీడా నైపుణ్యాన్ని పెంపొందించడానికి అన్ని వసతులతో కూడిన క్రీడా వికాస కేంద్రాల నిర్మాణానికి 2015–16లో అప్పటి టీడీపీ ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. ప్రతి నియోజకవర్గ కేంద్రంలో క్రీడా వికాస కేంద్రం ఏర్పాటుకు స్థల సేకరణ చేసి ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించారు. తొలుత 75 నియోజకవర్గాల్లో వికాస కేంద్రాలను ప్రభుత్వం మంజూరు చేసింది. ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలో ఎనిమిది నియోజకవర్గాలకు ఈ కేంద్రాలు మంజూరయ్యాయి. ఒక్కొక్క కేంద్రానికి రూ.2.10 కోట్ల చొప్పున ప్రభుత్వం మంజూరు చేసింది. గోపాలపురం నియోజకవర్గానికి దేవరపల్లిలోని అంబటి సత్యనారాయణరావు జెడ్పీ హైస్కూల్లో వికాస కేంద్రం ఏర్పాటుకు 2013–14లో అప్పటి ఏఎంసీ చైర్మన్, ప్రస్తుత దేవరపల్లి ఎంపీపీ కేవీకే దుర్గారావు, దేవరపల్లి హైస్కూల్ ఫిజికల్ డైరెక్టర్ పేరం రవీంద్రనాథ్ ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించారు. అనంతరం 2014–15లో టీడీపీ ప్రభుత్వంలో పేరం రవీంద్రనాథ్ శాప్ డైరెక్టర్‌గా బాధ్యతలు చేపట్టారు. దేవరపల్లిలో క్రీడా వికాస కేంద్రం మంజూరుచేస్తూ 2016లో ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. 2016 నవంబరు 6న అప్పటి క్రీడల శాఖా మంత్రి కొల్లు రవీంద్ర క్రీడా వికాస కేంద్రం నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. ఏడాదిలోగా నిర్మాణం పూర్తి చేసి ప్రారంభిస్తామని ఈ సందర్భంగా ప్రకటించారు. ప్రారంభించిన పనులు అసంపూర్తిగా మిగిలిపోయాయి. అప్పట్లో కాంట్రాక్టర్లకు సకాలంలో బిల్లులు చెల్లించకపోవడంతో పనులు నిలిచిపోయాయి. రూ.2.10 కోట్లు మంజూరు కాగా, రూ.25 లక్షలు చెల్లించినట్టు తెలిసింది.

అన్ని సదుపాయాలతో వికాస కేంద్రం

క్రీడాకారులకు అవసరమైన అన్ని సౌకర్యాలతో క్రీడా వికాస కేంద్రం నిర్మిస్తారు. వికాస కేంద్రానికి కోచ్‌ను నియమించి రోజూ క్రీడాకారులకు శిక్షణ ఇస్తారు. క్రీడా ప్రాంగణంలో అన్నిరకాల క్రీడా కోర్టులు ఏర్పాటు చేస్తారు. జిమ్, బాలికలు, బాలురు దుస్తులు మార్చుకునే గదులు, రెండు ఉడెన్ షటిల్ కోర్టులు, టేబుల్ టెన్నిస్, బాస్కెట్ బాల్, వాలీబాల్ కోర్టులు ఏర్పాటు చేయాలి. క్రీడా మైదానాన్ని మెరక్ చేసి క్రీడాకారులకు అసౌకర్యం కలగకుండా చూడాలి. 50 మంది క్రీడాకారులకు వసతి సదుపాయం కల్పించవలసి ఉంది. నియోజకవర్గస్థాయిలో జరిగే క్రీడా పోటీలు ఇక్కడ నిర్వహిస్తారు.

క్రీడాపటంలో దేవరపల్లికి గుర్తింపు

క్రీడా పటంలో దేవరపల్లికి గుర్తింపు లభించిందనడంలో అతిశయోక్తి లేదు.1994 ఆగస్టు 9న పేరం రవీంద్రనాథ్ టి.నర్సాపురం జెడ్పీ హైస్కూల్ నుంచి బదిలీపై దేవరపల్లి హైస్కూల్‌కు వచ్చారు. అప్పటి వరకూ క్రీడలంటే తెలియని ఈ ప్రాంత విద్యార్థులకు క్రీడల పట్ల అవగాహన కల్పించి విద్యార్థులకు పలు రకాల క్రీడల్లో శిక్షణ ఇవ్వడం ప్రారంభించారు. ముళ్ల పొదలతో ఉన్న క్రీడా మైదానాన్ని శుభ్రం చేసి క్రీడా కోర్టులు ఏర్పాటు చేశారు. నియోజకవర్గ, జిల్లా, రాష్ట్రస్థాయి క్రీడా పోటీలు దేవరపల్లిలో నిర్వహించే స్థాయికి ఈ హైస్కూలు ఎదిగింది. దాదాపు 22 ఏళ్లు రవీంద్రనాథ్ ఇక్కడ పీడీగా పనిచేసి వందలాది మంది జిల్లా, రాష్ట్ర, జాతీయ, అంతర్జాతీయ క్రీడాకారులను తయారు చేశారు. ఇక్కడ వికాస కేంద్రం నిర్మాణం పూర్తయితే ఎంతో మంది క్రీడాకారులకు ఉపయోగకరంగా ఉంటుంది.

ప్రభుత్వం సుముఖత



క్రీడా వికాస కేంద్రాల నిర్మాణాలకు ప్రభుత్వం సుముఖంగా ఉంది. రాష్ట్రంలోని 35 క్రీడా వికాస కేంద్రాలను పూర్తి చేయడానికి ఇటీవల ప్రభుత్వం రూ.23 కోట్లు మంజూరు చేస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. దేవదరపల్లిలో అసంపూర్తిగా ఉన్న వికాస కేంద్రం నిర్మాణ పనులు త్వరలో ప్రారంభం కానున్నాయి. మెట్ట ప్రాంతంలోని గ్రామీణ క్రీడాకారులకు ఈ వికాస కేంద్రం అందుబాటులోకి వస్తే ఎంతో మేలు చేకూరుతుంది. ఇద్దరు కోచ్‌లు నిరంతరం ఇక్కడ ఉండి క్రీడాకారులకు శిక్షణ ఇస్తారు. శంకుస్థాపన చేసి ఎనిమిదేళ్లు అయింది.

– పేరం రవీంద్రనాథ్, శాప్ మాజీ డైరెక్టర్, దేవరపల్లి